

8లో..

## ఎన్నెన్నో ప్రత్యేకతలు

- కాఫీ టేబుల్ బుక్‌ను ఆవిష్కరించిన సీఎస్ రామకృష్ణారావు

# వరంగల్ వాయిస్

Evening Daily

సంపుటి : 04 | సంచిక : 350
పేజీలు : 08 | వెల: రూ.5/-

బుధవారం
నవంబర్ 12, 2025

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




# పక్షం రోజుల ముందే.. పనులు పూర్తి



- నాణ్యతలో రాజీపడేది లేదు
- గిరిజన పూజారుల సూచన మేరకే పునరుద్ధరణ
- ముందస్తు మొక్కులకు నో ప్రాబ్లమ్
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- మేడారంలో పర్యటించిన నలుగురు మంత్రులు
- అధికారులతో సమీక్ష సమావేశం
- భక్తులకు మౌలిక వసతుల కల్పనపై చర్చ

వివరాలు2లో..

శ్రీ సమ్మక్క సారలమ్మ దేవాలయం, మేడారంలో చేపట్టిన అభివృద్ధి పనులను జాతరకు పక్షం రోజుల ముందే పూర్తి చేయాలని జిల్లా ఇంచార్జి మంత్రి, రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. గిరిజన పూజారుల సూచన మేరకే మేడారం పునరుద్ధరణ పనులు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. పనుల నాణ్యతలో రాజీ పడేది లేదని తేల్చి చెప్పారు. ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారంలో బుధవారం నలుగురు మంత్రులు పర్యటించారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితోపాటు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హైదరాబాద్ నుంచి హెలికాప్టర్ లో ద్వారా మేడారం చేరుకోగా దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ రోడ్డు మార్గంలో వరంగల్ నుంచి మేడారం చేరుకున్నారు. అయితే ముందుగా వచ్చిన ముగ్గురు మంత్రులు తొలుత అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేయగా, మంత్రి సురేఖ సింగిల్ గానే తల్లులను దర్శించుకున్నారు. వీరితోపాటు మేడారం చేరుకున్న మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయక్, చీఫ్ మినిస్టర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ కేఎస్ శ్రీనివాసరాజులకు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్., ఎస్పీ శబరిష్ పుష్ప గుచ్ఛాలు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. అనంతరం అందరూ కలిసి అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. - వరంగల్ వాయిస్, ములుగు





8లో..

## మహాదేవయ్యను విధుల్లోకి తీసుకోవాలి

- గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షులు వెంకటేశ్వర్లు
- ఎంపీ కడియం కావ్యకు వినతి



8లో..

## మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించాలి

- నియంత్రణకు పాటుపడాలి
- కలెక్టర్ సత్య శారద



## పోలీస్ పీఆర్వోకు ప్రశంసా పత్రం

☐ డీజీపీ చేతుల మీదుగా అందజేత

తెలంగాణ పోలీస్ సురక్ష ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర పోలీస్ పీఆర్వోలకు హైదరాబాద్ సిటీ పోలీస్ శిక్షణ కేంద్రంలో మూడు రోజుల పాటు శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. విజయవంతంగా శిక్షణ పూర్తి చేసిన వరంగల్ పోలీస్ కమిషనరేట్ పీఆర్వో మన్నవ మోహన కృష్ణను అభినందిస్తూ రాష్ట్ర తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐజీ ఎం.రమేష్ రెడ్డితో పాటు ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు. – వరంగల్ వాయిస్, క్రైం



# పక్షం రోజుల ముందే.. పనుల పూర్తి

- నాణ్యతలో రాజీపడేది లేదు
- గిరిజన పూజారుల సూచన మేరకే పునరుద్ధరణ
- ముందస్తు మొక్కులకు నో ప్రాబ్లమ్
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- మేడారంలో పర్యటించిన నలుగురు మంత్రులు
- అధికారులతో సమీక్ష సమావేశం
- భక్తులకు మౌలిక వసతుల కల్పనపై చర్చ

**వరంగల్ వాయిస్, ములుగు :** ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారంలో బుధవారం నలుగురు మంత్రులు పర్యటించారు. తొలుత మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మలను రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండ సురేఖ, దనసరి అనసూయ సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తోపాటు పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయక్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వనదేవతల పూజారులు దగ్గరుండి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం శ్రీ సమ్మక్క సారలమ్మ దేవాలయం అభివృద్ధి పనులను మంత్రులు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. నాలుగు కాలాలపాటు గుర్తుండేలా పనులుండాలంటూ అదేశించారు. పనుల్లో తేడా వస్తే ఉపేక్షించేది లేదంటూ హెచ్చరించారు.

## పనులపై సమీక్ష..

అనంతరం మంత్రులు మేడారం హరిత కాకతీయ హోటల్ లో మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్ తో కలసి సంబంధిత శాఖల ఉన్నత స్థాయి అధికారులు, గుత్తేదార్లతో మేడారం జాతర అభివృద్ధి పనుల పురోగతి, మాస్టర్ ప్లాన్ రూపకల్పనపై కూలంకషంగా సమీక్షించారు. పనులు సమర్థవంతంగా నిర్వహించుటకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మేడారంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై, ప్రాకారం లోపల, సివిల్ పనులు, గద్దెల ఎత్తు పెంచడం, నిర్మాణం, ప్రధాన ద్వారాలు, ఆర్చ్, 4 వాచ్ టవర్లు, ప్రాకారానికి చుట్టూ సీసీ రోడ్డు పనులను సమాంతరంగా చేపట్టి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలన్నారు. దీనికితోడుగా గ్రీనరీ, ప్లాంటేషన్ చేయాలన్నారు. కావలసిన గ్రానైట్ ను త్వరితగతిన తెప్పించుకోవాలన్నారు. మెన్ మెటీరియల్ పెంచి 24 గంటలూ పనులు జరగాలన్నారు. మేడారంలో రోడ్డు నిర్మాణ పనులు డివైడర్లు, ప్లాంటేషన్ తో సహా నెల రోజుల్లో పూర్తి కావాలన్నారు.. మాస్టర్ ప్లాన్ లో భాగంగా మొదటి విడతలో క్యూ లైన్ షెడ్స్, నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ, టెంపర్ అభివృద్ధి, గద్దెల వద్ద భక్తుల కెపాసిటీ మూడు వేల నుంచి పది వేలకు పెంచనున్నట్లు తెలిపారు. 19 ఎకరాలు భూ సేకరణ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

## ముఖ్యమంత్రి కోరిన విధంగా..

సీఎం కోరిన విధంగా జంపన్నవాగుపై చెక్ డ్యామ్ ల ఏర్పాటుకు ఇరిగేషన్ అధికారులు తక్షణమే ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. శాశ్వత బస్ స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదించాలని, పర్యాటక శాఖ ద్వారా జంపన్నవాగు అభివృద్ధి, సుందరీకరణ ప్రతిపాదనలు సిద్ధం చెయాలన్నారు. పశు సంవర్ధక శాఖ ద్వారా నాలుగు అధునాతన పశు వదశాలలు ఏర్పాటు చేయాలని తెలిపారు. మేడారం చుట్టటూ




రహదారులకు మరమ్మతులు చేపట్టాలన్నారు. మేడారానికి వచ్చే ప్రధాన రహదారిలో ఎలాంటి అడ్డంకులు ఉండకుండా చూడాలన్నారు.

ప్రధాన రహదారిలో అక్కడక్కడ మిగిలిన పనులతో పాటు మల్లంపల్లి బ్రిడ్జి, కటాక్షపూర్ బ్రిడ్జిపై ప్రత్యేక శ్రద్ధ చూపి డిసెంబర్ 15 లోగా పూర్తి కావాలని నేషనల్ హై వే అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల ప్రగతిని పరిశీలించేందుకు ఈ నెల 22 న తిరిగి వస్తామని, నిర్దేశిత పనులు పూర్తి కావాలన్నారు. నాణ్యతతో రాజీపడేది లేదని, తేడా వస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మినిస్టర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ కేఎస్ శ్రీనివాసరాజు, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్. హరీష్, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్., ఎస్పీ శబరిష్, డీఎఫ్ఓ రాహూల్ కిషన్ జాదవ్, అదనపు కలెక్టర్లు (రెవెన్యూ) సీహెచ్ మహేందర్ జి, (స్థానిక సంస్థలు) సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, ఆర్ అండ్ బీ, పీఆర్ ఈఎన్ సీ, ఆర్డీఓ వెంకటేష్, ప్రజా ప్రతినిధులు, పూజారులు, జిల్లా అధికారులు, ఆర్కిటెక్చర్, గుత్తేదారులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.








### ముందస్తు మొక్కులకు నో ప్రాబ్లమ్..:
**- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

ముందస్తు మొక్కులు చెల్లించుకునే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పనులను పూర్తి చేస్తాం. వచ్చే రెండు వందల సంవత్సరాల పాటు పనులు శాశ్వతంగా నిలిచిపోయే విధంగా అభివృద్ధి చేపట్టాము. 25 రోజుల క్రితం పనులు ప్రారంభం కాగా ఆయా పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. అధికారులు, గుత్తే దారులతో సమీక్ష అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా గిరిజన పూజారుల సూచన మేరకే మేడారంలో పునరుద్ధరణ పనులు చేపట్టాం. భవిష్యత్ లో 10 కోట్ల మంది భక్తులకు సరిపోయే విధంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నాం. మేడారంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, మేడారం మాస్టర్ ప్లాన్ పై త్వరలో ముఖ్యమంత్రి సమక్షంలో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు.

### జాతీయ పండుగా గుర్తించాలి : మంత్రి కొండా సురేఖ

గతంలో మేడారంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదు. సీఎం రేవంత్ రెడ్డి వచ్చాక మేడారం అభివృద్ధి అడుగులు పడ్డాయి. ఈ అభివృద్ధి చరిత్రలో నిలిచిపోతుంది. మేడారం జాతరను జాతీయ పండుగగా గుర్తించాలి. దీనిపై కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కలిసి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీని ఒప్పించాలి. మేడారం మహాజాతర నాటికి పనులు పూర్తవుతాయి.

### దేవుడిపై రాజకీయాలా? : మంత్రి సీతక్క

మేడారం అంటే తమ బంధం, భక్తి, భావోద్వేగం, బాధ్యత. మేడారంలో పది తరాలకు సరిపడ అభివృద్ధి చేపట్టాం. దీక్షతో, బాధ్యతతో జాతరనాటికి పనులు పూర్తి చేస్తాం. కొందరు తప్పుడు ప్రచారం చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారు. దేవుడిపై రాజకీయాలు చేయొద్దన్నారు. గతంలో వేసిన షెడ్లను తొలగించి పక్కకు పెట్టాం. మేడారంలో ఎలాంటి ప్రతిమలు లేకపోయినా కోట్లాది మంది భక్తులు తరలివస్తున్నారు. సమ్మక్క – సారలమ్మ ఆదివాసీల అస్థిత్వానికి సంకేతం.

# కొనుగోలు కేంద్రాల నిర్వహణ పక్కాగా ఉండాలి

■ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**వరంగల్ వాయిస్, జనగామ :** జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ బుధవారం బచ్చన్నపేట మండలంలో విస్తృతంగా పర్యటించి, ధాన్యం కొనుగోలు కేంద్రాలు, కేజీబీవీ పాఠశాల, పీహెచ్‌సీ, తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ముందుగా తమ్మడపల్లిలోని పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యంపై తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. తేమ శాతం సరిగా ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, ఆలస్యం చేస్తే నిర్వాహకులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ధాన్యం తెచ్చిన రైతులు కూడా తమ ధాన్యాన్ని ఆరబెట్టుకుని, తేమ శాతం రాగానే త్వరగా కొనుగోలు అయ్యేలా కేంద్రాలలోనే అందుబాటులో ఉండాలని సూచించారు. అనంతరం బచ్చన్నపేటలోని ఐకేపీ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్, రిజిస్టర్‌లను సక్రమంగా నిర్వహించకపోవడం, కొనుగోలు వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయకపోవడంపై నిర్వాహకులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి, వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేజీబీవీ పాఠశాలకు వెళ్లి ముందుగా ఉపాధ్యాయ సిబ్బందితో మాట్లాడి, మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం పెడుతున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతికి సంబంధించిన సిలబస్ ఎంత వరకు వచ్చిందో, పరీక్షలకు సంబంధించిన యాక్షన్ ప్లాన్ గురించి అడిగారు. విద్యార్థులతో మాట్లాడి భోజనం నాణ్యత, మెనూ అమలుపై ఆరా తీశారు. పదవ తరగతి పరీక్షలకు ఇప్పటి నుంచే షెడ్యూల్ పెట్టుకొని చదవాలని, మంచి మార్కులు సాధిస్తేనే జిల్లాకు మంచి పేరు వస్తుందని సూచించారు. చదువును, ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయవద్దని తెలిపారు. దిక్సూచి కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అన్ని పరీక్షలు చేశారా లేదా అని ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, ముందుగా సిబ్బంది హాజరును, వివిధ రకాల టీకాల, మందుల నిల్వలను పరిశీలించారు. చలి తీవ్రత నేపథ్యంలో ఓపీకి వచ్చే ప్రతీ ఒక్కరికి రక్త పరీక్షలు చేయాలని వైద్యులకు సూచించారు. రోగులతో మాట్లాడి పీహెచ్‌సీలో అందుతున్న వైద్యం గురించి ఆరా తీశారు. డాక్టర్లు సమయానికి వస్తున్నారా, బాగా చూసుకుంటున్నారా, భోజనం ఎలా ఉంటుందనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. చివరగా తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లిన కలెక్టర్, రెవెన్యూ పరంగా ఎలాంటి పెండింగ్ పనులు లేకుండా చూడాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్, సివిల్ సప్లై, మార్కెటింగ్, మెడికల్ అధికారులు పాల్గొన్నారు.

## డిసెంబర్ 3న రెడ్ క్రాస్ సొసైటీ సర్వ సభ్య సమావేశం




**వరంగల్ వాయిస్, పరకాల :** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, హనుమకొండ జిల్లా శాఖ సర్వ సభ్య సమావేశం డిసెంబర్ 3న సమీకృత కార్యాలయ భవనం , సుబేదారిలో జరగనుంది. ఈ సమావేశాన్ని సంస్థ అధ్యక్షులైన జిల్లా కలెక్టర్ నిర్ణయించారు. కాబట్టి, సభ్యులందరూ ఈ ప్రకటనను ఆహ్వానంగా పరిగణించి నిర్ణీత సమయానికి హాజరు కావలసిందిగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, హనుమకొండ జిల్లా చైర్మన్ డాక్టర్ పెసరు విజయేందర్ రెడ్డి కోరారు. గత ఐఆర్ సీఎస్ హనుమకొండ ఏజీఎంలోని ఎజెండా నిర్ణయాలపై , ఐఆర్ సీఎస్ హనుమకొండ జిల్లా శాఖ 2022–23, 2023–24, 2024–25 సంవత్సరాల వార్షిక నివేదిక, పై మూడు సంవత్సరాల ఆదాయ–వ్యయాల ఆడిటెడ్ లెక్కలు, రాబోయే ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆదాయ–వ్యయ బడ్జెట్ ఆమోదం, ఆడిటర్ నియామకం, అధ్యక్షుల అనుమతితో ఇతర అంశాలపై చర్చ జరగనుందని చైర్మన్, పాలకమండలి సభ్యులు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, సభ్యులు తెలియజేశారు.

## మహా రుద్ర యాగ మహోత్సవ ఏర్పాట్లు

పరిశీలించిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణ కేంద్రంలోని శ్రీ కుంకుమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం నిర్వహించనున్న మహా రుద్ర యాగ మహోత్సవ ఏర్పాట్లను పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి బుధవారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు అధికారులు, నిర్వాహకులు, సేవా సంస్థల ప్రతినిధులతో ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు.యాగం విజయవంతం కావడానికి మరియు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ఎమ్మెల్యే నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో ఈ మహారుద్రయాగ మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు.

# విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలి

■ ఏఐఎస్ఎఫ్ నాయకుల డిమాండ్




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని, అలాగే పెండింగ్‌లో ఉన్న పూర్తి స్థాయి ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి భాషబోయిన సంతోష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ హనుమకొండ బస్టాండ్ ఏరియా కమిటీ విస్తృత స్థాయి సమావేశం ఆ ఏరియా ఇంచార్జ్, జిల్లా ఉపాధ్యక్షులు జక్కుల భాను ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన భాషబోయిన సంతోష్ విద్యార్థి సమస్యలపై మాట్లాడారు. విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తే విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు, పోటీతత్వం, అంకితభావం, సేవా దృక్పథం, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ అవగాహన పెరుగుతాయని అన్నారు. ఎన్నికల ద్వారా మెరుగైన ఉద్యమాలు వచ్చి, ప్రభుత్వ విద్యాసంస్థలు మరింత పటిష్టంగా మారడానికి అవకాశం ఉంటుందని, సమాజానికి మంచి నాయకులు తయారవుతారని పేర్కొన్నారు. అయితే, పాలక ప్రభుత్వాలు సంఘాలకు అస్తిత్వం పెరిగితే తమను ప్రశ్నించే తత్వం పెరుగుతుందని భావించి, విద్యార్థులను ఐక్యం కాకుండా నిలువరిస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వం తక్షణమే విశ్వవిద్యాలయాలలో, ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ ప్రభుత్వం ముందు పలు ప్రధాన డిమాండ్లు ఉంచింది. పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలు, బెస్ట్ అవైలబుల్, బకాయిలు, స్కాలర్‌షిప్ రియంబర్స్‌మెంట్‌ను పూర్తి స్థాయిలో విడుదల చేయాలి. దీని ప్రభావం యాజమాన్యాల కంటే విద్యార్థులపైనే ఎక్కువగా పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని వెంటనే అమలు చేయాలి. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి.ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని పగడ్బందీగా అమలు చేయాలి. ఫైర్ సేఫ్టీ, ల్యాబ్ సౌకర్యాలు, క్వాలిఫైడ్ లెక్చరర్లు, కనీస మౌలిక సదుపాయాలు లేని కళాశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ బస్టాండ్ ఏరియా కార్యదర్శి బొంత శ్రావణ్, ఉపాధ్యక్షులు బన్నీ, కార్తీక్, అన్వేష్, బి.చరణ్, అభి, పి.రోహిత్, ఎస్.పవన్, పి.మణికంఠ, రాజు, ప్రణీత్‌లతో పాటు తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు బహుమతులు



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** మండలంలోని కన్నెగుండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జడ్పీహెచ్ఎస్)లో ఫిజిక్స్ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కె.రాజేశ్వర రావు తన కుమారుడి పుట్టిన రోజును వినూత్నంగా నిర్వహించారు. రాజేశ్వర రావు కుమారుడు, గోద్రెజ్ కంపెనీ లిమిటెడ్ అసిస్టెంట్ మేనేజర్ రోహిత్ పుట్టిన రోజు సందర్భంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వివిధ రకాల బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి లక్ష్మ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటూ, తన కుమారుడి పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు బహుమతులు అందించిన టీచర్ రాజేశ్వర రావు చేసిన సేవలను ఆమె కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాధవరావు, వెంకట నరసయ్య, వాణీ శ్రీ, వెంకన్న, శ్రీనివాస్ రావు, రామకృష్ణ, లోకేందర్ రెడ్డి, దస్తగిరి, నరేందర్, రాజేశ్వరి, నాగమణి, ఉరియ, రామ్మూర్తి పాల్గొన్నారు.

## కేయూలో అందెశ్రీకి ఘన నివాళి



**వరంగల్ వాయిస్, కేయూ :** ప్రముఖ కవి, రచయిత, తెలంగాణ ఉద్యమ గీతాల రచయిత అందెశ్రీ ఆకస్మిక మరణం పట్ల డీజీటీయూ రాష్ట్ర అధ్యక్షులు కొమురయ్య పెండ్యాల, పలువురు ప్రముఖులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొమురయ్య పెండ్యాల మాట్లాడుతూ అందెశ్రీ గారి జీవితం, సాహితీ ప్రయాణం, తెలంగాణ సమాజానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా వారి చిత్రపటానికి కొమురయ్య పెండ్యాలతో పాటు కాకతీయ యూనివర్సిటీ బీఈడీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టరు నల్లారి శ్రీనివాస్, డాక్టర్ జగన్, డాక్టరు కోటేశ్వర్ రావు, సుభాష్ రిపోర్టర్, డాక్టర్ వంగాల సుధాకర్, రిటైర్డ్ హెచ్ఎం ముచింతల హనుమంత రావు, రిటైర్డ్ టీచర్ మొగిలి, తదితరులు పాల్గొని, పూలతో ఘనంగా నివాళులు అర్పించారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు డోర్నకల్ విద్యార్థినుల ఎంపిక



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** జనగామ జిల్లాలోని సోషల్ వెల్ఫేర్ పాఠశాల మైదానంలో ఇటీవల జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–16 (బాలురు, బాలికల సెక్షన్) ఫుట్‌బాల్ ట్రయల్స్‌లో పీఎంశ్రీ డోర్నకల్ పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. నలుగురు విద్యార్థినిలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు అని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బండి నరసింహా రావు, వ్యాయామ ఉపాధ్యాయులు (పీఈటీ) కొండ్ర రవికుమార్ తెలిపారు. పాఠశాలలో చదువుతున్న తోనగర్ తులసి, రెడ్డబోయిన కార్తిక, కట్రోజ్ వైష్ణవి, టెర్రి గౌతమి లు నాలుగు విద్యార్థినిలు ఎంపికయ్యారన్నారు. ఈనెల 14 నుంచి 16 వరకు నల్గొండ జిల్లా కేంద్రంలోని డాన్ బాస్కో పాఠశాలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు శేషుకుమారి,కమల,సమిత,అనిత,దమయంతి,వసంతరాణి,మంజులత, శంకర్,అప్పిరెడ్డి , శ్రీనివాస్, విద్యాసాగర్,సాహెబ్ అల్లి, బిచ్చు,శంకరయ్య తదితరులు అభినందించారు.

# కట్టను తొలగించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** పట్టణంలోని కొర్లకుంట కట్టను అక్రమంగా తొలగించిన వ్యక్తులపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సీఐ చంద్రమౌళికి వినతి పత్రం అందించిన అనంతరం భాజపా నాయకులు విలేకరులతో మాట్లాడారు. గత 60 సంవత్సరాలుగా కొర్లకుంట ద్వారా రైతులకు సాగునీరు అంది వ్యవసాయ పనులు జరుగుతున్నాయని భాజపా నాయకులు తెలిపారు. అయితే, గత ఆరు నెలల క్రితం కొందరు వ్యక్తులు ఈ కుంట కట్టను తొలగించి, కుంటను చదును చేసి ప్లాట్లుగా విక్రయించేందుకు సిద్ధపడుతున్నారని ఆరోపించారు. పది రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు కట్ట లేకపోవడంతో ఆ నీరు పట్టణంలోని వివిధ గృహాలలోకి, రైల్వే స్టేషన్‌లో పట్టాలపైకి చేరి తీవ్ర ఇబ్బందులు గురి చేసిందన్నారు. కొర్లకుంట కట్టను తొలగించిన వ్యక్తులను గుర్తించి, వారిపై కఠిన చర్యలు తీసుకొని, ప్రజలకు న్యాయం చేయాలని భాజపా నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నాయకులు నరేష్ నాయక్, మానుకోట జిల్లా కౌన్సిల్ మెంబర్ లక్ష్మీనారాయణ వ్యాస్, డోర్నకల్ మండలాధ్యక్షులు గణేష్ నాయక్, పట్టణాధ్యక్షులు దేవా నాయక్, మాజీ మండలాధ్యక్షులు బాసాని నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా ఆరోగ్యంపై సదస్సు




**వరంగల్ వాయిస్, వరంగల్ :** స్థానిక లాల్ బహదూర్ కళాశాలలో మహిళా సాధికారికత కమిటీ ఆధ్వర్యంలో 'మహిళలు, ఆరోగ్యం, భద్రతాపరమైన అంశాలపై జాగ్రత్తలు' అనే అంశంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్.రావు అధ్యక్షత వహించారు. ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ కూరపాటి రాధిక ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడారు.విద్యార్థినులు వ్యక్తిగత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు తీసుకోవాల్సిన మెలకువలను, జాగ్రత్తలను వివరించారు. ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు తప్పనిసరిగా తల్లికి లేదా వైద్యులకు తెలియజేసి, మెరుగైన చికిత్స పొందాలని చెప్పారు. దీని ద్వారా భవిష్యత్తులో సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. మహిళలు వ్యక్తిగత పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, దీనివల్ల ఆరోగ్య సమస్యలు దరిచేరవని అన్నారు. అలాగే, విద్యార్థులు మానసిక ఒత్తిడి నుంచి బయటపడేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆరోగ్యమే మహాభాగ్యమని గుర్తు చేస్తూ, ఆరోగ్యానికి సంబంధించిన చిట్కాలు, తీసుకోవలసిన జాగ్రత్తలపై ఆమె సమగ్రమైన ఉపన్యాసం చేశారు. ఈ సెమినార్ కార్యక్రమంలో మహిళా సాధికారికత కమిటీ కన్వీనర్ ఎం.రాధిక, ప్రశాంతి, రజిని, సుజాత, సుచిత్ర, మమత, ప్రియాంక, భార్గవి, ఇతర మహిళా అధ్యాపకురాళ్లు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

# 14న కేయూలో ఎంఎస్ ఆచార్య 7వ స్మారక ఉపన్యాసం

**వరంగల్ వాయిస్, కేయూ :** ఎం.ఎస్.ఆచార్య 7వ స్మారక ఉపన్యాస కార్యక్రమాన్ని ఈ నెల 14న గంటలకు విశ్వవిద్యాలయ సెనెట్ హాల్‌లో నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి న్యూఢిల్లీ ఆంధ్రజ్యోతి అసోసియేట్ ఎడిటర్ ఏ.కృష్ణారావు ముఖ్య వక్తగా హాజరై "షిఫ్టింగ్ స్టాండర్డ్స్ ఇన్ జర్నలిజం అండ్ లిటరేచర్ " అనే అంశంపై స్మారక ఉపన్యాసం చేస్తారు. ఈ కార్యక్రమానికి వైస్–ఛాన్సలర్ ఆచార్య కె.ప్రతాప్ రెడ్డి అధ్యక్షత వహిస్తారు. బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధక విద్యార్థులు, సాధారణ విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని రిజిస్ట్రార్ కోరారు.

# కమ్యూనిస్టులే పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రత్యామ్నాయం

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి
- జిల్లాలో జనసేవాదళ్ శిక్షణ శిబిరాలు ప్రారంభం

**వరంగల్ వాయిస్, వరంగల్ :** కమ్యూనిస్టులే పెట్టుబడిదారీ వ్యవస్థకు సరైన ప్రత్యామ్నాయంగా నిలబడతారని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం వరంగల్ నగరంలోని ఓ సిటీ మైదానంలో ప్రారంభమైన జిల్లా స్థాయి జనసేవాదళ్ శిక్షణ శిబిరాలకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని, దానికి ప్రత్యామ్నాయంగా కమ్యూనిస్టులు నిలబడుతున్నారని తెలిపారు. రానున్న కాలంలో భారతదేశంలో మతోన్మాద, పెట్టుబడిదారీ వ్యవస్థకు కాలం చెల్లడం ఖాయమన్నారు. భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం పోరాడిన చరిత్ర సీపీఐదని, భారత గడ్డపై 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్నదని తెలిపారు. స్వాతంత్ర్యం అనంతరం అంతరాలు లేని సమాజం కోసం, భూ సంస్కరణల అమలు కోసం, పీడిత ప్రజలకు అండగా నిలిచి, వెట్టి చాకిరి విముక్తికై పోరాడింది సీపీఐయే అన్నారు. బానిసత్వం, భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాటం నడిపి, రజాకార్లను తరిమికొట్టిన ఘనత కమ్యూనిస్టులదే అని గుర్తు చేశారు. 'దున్నే వానికే భూమి' నినాదంతో దొరల గడీలను బద్దలు కొట్టి, పేదవాడికి భూములు పంచిన చరిత్ర సీపీఐకి ఉందన్నారు.



అధికారం లేకపోయినా పేద ప్రజల పక్షాన నిలబడి వారి హక్కుల కోసం నిరంతరం కృషి చేస్తున్నదని చెప్పారు. జనసేవాదళ్ రాష్ట్ర కన్వీనర్ పంజాల రమేష్ మాట్లాడుతూ, డిసెంబర్ 26న ఖమ్మం వేదికగా జరిగే సీపీఐ శత వసంతాల ఉత్సవ ముగింపు సభ చారిత్రాత్మక ఘట్టంగా మిగిలిపోతుందని అన్నారు. ఇందుకోసం ప్రతి జనసేవాదళ్ కార్యకర్త విధిగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా మాట్లాడుతూ, సీపీఐ వందేళ్ల ముగింపు ఉత్సవాల సందర్భంగా ఈ నెల 18, 19 తేదీలలో సీపీఐ బస్ జాతా జరుగుతుందని, ఈ జాతాను పార్టీ, ప్రజా సంఘాల శ్రేణులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు పనాస ప్రసాద్, దండు లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు గుండె బద్రి, గన్నారపు రమేష్, బుస్స రవీందర్, సంగీ ఏలేందర్, కందిక చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

# యశ్వంత్ దాసరికి "యువ శాంతి దూత" అవార్డు




**వరంగల్ వాయిస్, హనుమకొండ:** హనుమకొండలోని వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాల ఈసీఈ ద్వితీయ సంవత్సరం విద్యార్థి యశ్వంత్ దాసరికి అంతర్జాతీయ శాంతి ప్రోత్సాహక సంస్థ నుంచి ప్రతిష్టాత్మకమైన "యువ శాంతి దూత" అవార్డు లభించింది. కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు మహమ్మద్ సిరాజుద్దీన్ ఈ అవార్డును యశ్వంత్‌కు ప్రదానం చేశారు. యశ్వంత్ దాసరి క్రీడా విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరచడంతో పాటు, క్రీడా స్ఫూర్తి, క్రమశిక్షణ, శాంతి సామరస్య విలువలను ప్రోత్సహించినందుకు ఈ గౌరవం దక్కింది. ఈ సందర్భంగా యశ్వంత్ తల్లిదండ్రులు విజయ్ కుమార్, వసంత తమ కుమారుడు సాధించిన ఈ గౌరవంపై ఆనందం వ్యక్తం చేశారు. అవార్డు అందుకున్న అనంతరం యశ్వంత్ దాసరి మాట్లాడుతూ "ఈ అవార్డు నాకు గొప్ప ప్రేరణ. భవిష్యత్తులో భారతదేశానికి కీర్తి తేవడానికి ఎయిర్ పిస్టల్ షూటింగ్ రంగంలో మరింత కృషి చేస్తాను," అని తెలిపారు.

# జాతీయ స్థాయి జూడో పోటీలకు కేయూ టీమ్ ఎంపిక



**వరంగల్ వాయిస్, కేయూ:** భోపాల్‌లోని సెజ్ యూనివర్సిటీలో నవంబర్ 13 నుంచి 14 వరకు జరగనున్న జూడో (పురుషుల) పోటీలకు కాకతీయ యూనివర్సిటీ (కేయూ) టీమ్‌ను ఎంపిక చేసినట్టు విశ్వవిద్యాలయ క్రీడా కార్యదర్శి ఆచార్య వై.వెంకయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఎం.సాయి కిరణ్ నాయక్ (విశ్వవిద్యాలయ వ్యాయామ కళాశాల), ఎల్.లక్ష్మణ్ (హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ), ఎం.ధీరజ్ (హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ), పి.శివాజీ (వాగ్దేవి డిగ్రీ కాలేజీ), ఎం.ధర్శిత్ నాయక్ (ఎల్.బి. కాలేజీ), బి.జయదీప్ (వరంగల్ సి.కె.ఎం. కాలేజీ) లుగా ఉన్నారు. ఈ జట్టుకు హనుమకొండ వాగ్దేవి డిగ్రీ అండ్ పీజీ కాలేజీ వ్యాయామ అధ్యాపకులు పి.కిషన్ కోచ్ కమ్ మేనేజర్‌గా వ్యవహరిస్తారని ఆచార్య వై.వెంకయ్య వెల్లడించారు.

# కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

◆ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**వరంగల్ వాయిస్, శాయంపేట :** భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు బుధవారం శాయంపేట మండలంలో విస్తృతంగా పర్యటించి, పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండలంలోని గట్లకానిపర్తి, మాందారిపేట, పత్తిపాక, శాయంపేట, మైలారం, జోగంపల్లి, పెద్దకోడెపాక గ్రామాల్లో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవాల్లో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రజా ప్రభుత్వం పూర్తిగా కొనుగోలు చేస్తుందని హామీ ఇచ్చారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకువచ్చి, ప్రభుత్వం నిర్ణయించిన గిట్టుబాటు ధరలను పొందాలని కోరారు. రైతుల సంక్షేమమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా జరపాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. మండల పర్యటనలో భాగంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సంక్షేమ పథకాల చెక్కులను కూడా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. శాయంపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో వివిధ గ్రామాలకు చెందిన మొత్తం 62 మంది లబ్ధిదారులకు రూ.62,07,192 విలువైన చెక్కులను అందజేశారు. పేదింటి ఆడపడుచులకు ఈ పథకం



ఆర్థికంగా ఎంతో తోడ్పాటును అందిస్తుందని, పేద కుటుంబాల సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వివిధ గ్రామాలకు చెందిన మొత్తం 16 మంది లబ్ధిదారులకు రూ.5,70,600 విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ ఫండ్ ఖరీదైన వైద్య చికిత్స చేసుకోలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ఎన్నో కుటుంబాలకు ఆసరాగా నిలుస్తుందని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే రైతులకు మొక్కజొన్న సబ్సిడీ విత్తనాలను కూడా అందజేశారు. ఈ కార్యక్రమాల్లో మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, చందుపట్ల రాజిరెడ్డి, మారపల్లి రవీందర్, నాయకులు పోలేపల్లి శ్రీనివాస్ రెడ్డి, చల్ల చక్రపాణి, అధికార ప్రతినిధి చిందం రవి, చిట్టి రెడ్డి రాజిరెడ్డి, అబ్బు ప్రకాశ్ రెడ్డి, చింతలరై పాల్, గ్రామ శాఖ అధ్యక్షుడు వరదరాజు, వైనాల కుమార్ స్వామి, డీసీఓ సంజీవరెడ్డి, సీఓ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీలు సంఘటితంగా పోరాడాలి

- ◆ సీఎం రేవంత్ రెడ్డి అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలి
- ◆ ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ మాదాసి సురేష్



**వరంగల్ వాయిస్, కేయూ :** బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించే విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు అన్ని రాజకీయ పార్టీలు మోసం చేస్తున్నాయని ప్రజా సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ మాదాసి సురేష్ ధ్వజమెత్తారు. కాకతీయ యూనివర్సిటీలో బీసీ విద్యార్థి జేఏసీ జిల్లా అధ్యక్షుడు ఆరేగంటి నాగరాజు ఆధ్వర్యంలో చేపట్టిన బీసీల ధర్మ పోరాట దీక్ష బుధవారం నాటికి మూడో రోజుకు చేరుకుంది. దీక్షలో పాల్గొని సంఘీభావం ప్రకటించిన మాదాసి సురేష్ మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించే విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. న్యాయస్థానాల్లో నిలబడదని తెలిసినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం 2018లో మోసపూరిత విధానంతో అసెంబ్లీ తీర్మానం ద్వారా పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లును తీసుకువచ్చిందని గుర్తు చేశారు. విద్య, ఉద్యోగాలతో పాటు స్థానిక ఎన్నికలకు సంబంధించిన రెండు బిల్లులతో సహా ఆర్డినెన్స్‌ను సైతం హైకోర్టు కొట్టివేసిందని ఆయన తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించడానికి రాజ్యాంగ సవరణే ఏకైక మార్గమని మాదాసి సురేష్ స్పష్టం చేశారు. రిజర్వేషన్‌ను రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్‌లో పొందపరచాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. దీనికోసం కేంద్ర ప్రభుత్వంపై బీజేపీ నాయకులతో పాటు అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఒత్తిడి తేవాలని కోరారు.ఈ సమస్య పరిష్కారం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు వెంటనే అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లాలని ఆయన డిమాండ్ చేశారు. రిజర్వేషన్ సాధించేవరకు బీసీలంతా ధర్మ పోరాట దీక్ష స్ఫూర్తిగా సంఘటితంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డెమొక్రటిక్ స్టూడెంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఉప్పుల శివ, కేయూ స్కాలర్ కాయిత నాగరాజు, బీసీ విద్యార్థి జేఏసీ నాయకులు శేర్ల రవితేజ, ఠాకూర్ అజయ్, బొంత రాజశేఖర్, ముడిత రాంబాబు, అప్పోజు హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగబద్ధంగా 42శాతం రిజర్వేషన్ కల్పించాలి

### వాల్మీకి యూత్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు సోదా రామకృష్ణ



**వరంగల్ వాయిస్, పరకాల :** కాకతీయ యూనివర్సిటీ ఎస్‌డీఎల్‌సీ ప్రాంగణంలో బీసీ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన "బీసీ బిల్లు ధర్మ పోరాట దీక్ష" మూడో రోజుకు చేరుకుంది. విద్యార్థి జేఏసీ జిల్లా అధ్యక్షులు ఆరేగంటి నాగరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ దీక్షా కార్యక్రమాన్ని ఆల్ ఇండియా వాల్మీకి యూత్ ఫ్రంట్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు సోదా రామకృష్ణ ప్రారంభించారు. దీక్షను ప్రారంభించిన అనంతరం సోదా రామకృష్ణ మాట్లాడుతూ... రాజ్యాంగబద్ధంగా బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయాలలో వారు ఎంతో వారి వాటా అంత తప్పకుండా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ఉద్యమం ఇక్కడితో ఆగకుండా భారతదేశం నలుమూలల ఉన్న బీసీలంతా ఏకమై రాజ్యాంగబద్ధమైనటువంటి హక్కులను తమిళనాడు తరహాలో తప్పకుండా సాధించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం తెలంగాణలో బీసీ చట్టబద్ధత కల్పించి, గవర్నర్ దగ్గరికి పంపిన విధంగానే, రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు పాస్ చేసి తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. అఖిల భారతీయ వాల్మీకి యూత్ ఫ్రంట్ రాష్ట్ర సంఘం తరపున బీసీల ధర్మ పోరాటానికి పూర్తి మద్దతు తెలుపుతున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ జేఏసీ ఉపాధ్యక్షులు ఊరగాని యాదగిరి గౌడ్, కాకతీయ యూనివర్సిటీ కౌన్సిల్ మెంబర్, జేఏసీ చైర్మన్, మాజీ ఉద్యమకారుడు చిర్ర రాజు గౌడ్, ప్రముఖ బీసీ నాయకులు తుపాకుల రవి, విద్యావంతులు తదితరులు పాల్గొన్నారు.

## టీ షర్ట్స్, టై బెల్ట్ అందజేత



**వరంగల్ వాయిస్, తొర్రూరు:** ఉపాధ్యాయులు విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలని మండల విద్యాశాఖ అధికారి ఎం.శ్రీదేవి ఉపాధ్యాయులకు సూచించారు. దంతాలపల్లి మండలం దాట్ల ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు చింతల సురేష్ సతీమణి చింతల మానస సురేష్ ఆర్థిక సహకారంతో బుధవారం విద్యార్థులకు టీ షర్ట్స్, పరీక్షా సామగ్రి, టై, బెల్ట్‌లను ఎంఈఓ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ ఎం.శ్రీదేవి మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల కోసం దాతలు ముందుకు వచ్చి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని కోరారు. విద్యార్థులు బాగా చదువుకుని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.కే.పాషా మాట్లాడుతూ, తమ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుడు చింతల సురేష్ విద్యార్థులకు అవసరమైన సామాగ్రిని పంపిణీ చేయడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీందర్, అనిత, కవిత, అపర్ణ, రామచంద్రు, తల్లిదండ్రులు ఉమా, వెంకటమ్మ పాల్గొన్నారు.

# మురుగు కంపులో మైనార్టీ స్కూల్

- ■ విద్యార్థినుల సమస్యలు పరిష్కరించాలి
- ■ డీఎస్ఎఫ్ఐ నాయకుల డిమాండ్



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** మండల కేంద్రంలోని మైనార్టీ గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థినులు మురుగు కంపు నీరుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దోమలతో బాధపడుతూ ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని డీఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు శాంతి కుమార్, కోశాధికారి గూగులోతు సూర్య ప్రకాష్ ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం డీఎస్ఎఫ్ఐ జిల్లా ఇంచార్జి భూక్య శ్రీకాంత్ ఆధ్వర్యంలో విద్యార్థి నాయకులు పాఠశాలను సందర్శించి సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు శాంతి కుమార్, గూగులోతు సూర్య ప్రకాష్ మాట్లాడుతూ డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రు నాయక్ ఆదేశాల మేరకు మైనార్టీ గురుకుల పాఠశాల సమస్యల పరిష్కారానికి దాదాపు ₹ 10 లక్షల రూపాయల నిధులు కేటాయించడం జరిగిందన్నారు. నిధులు కేటాయించినప్పటికీ, మురుగు నీరు బయటకు వెళ్లాలనే ఉద్దేశ్యంతో వేసిన పైపులైన్‌ను లోతుగా వేయకుండా కేవలం పైపైనే వేసి పనులు పూర్తి చేశారని ఆరోపించారు. దీని కారణంగా మురుగు నీరు బయటకు వెళ్లక, ప్రస్తుతం అక్కడే నిల్వ ఉండి కంపుతో విద్యార్థినులు తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలిపారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం పట్ల రాజకీయ ప్రయోజనాలను పక్కన పెట్టి, వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని తక్షణమే పనులు పూర్తి చేయాలని వారు హెచ్చరించారు. ఆ మురుగు నీరు లేకుండా తక్షణమే శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించకపోతే చూస్తూ ఊరుకోమని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఎఫ్ఐ మండల నాయకులు నరేష్, శ్రీను, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## చేనేత కార్మికుడు మేరుగు మురళి మృతి

### కుటుంబానికి చిప్ప వెంకటేశ్వర్లు పరామర్శ




**వరంగల్ వాయిస్, కొత్తవాడ:** వరంగల్‌లోని కొత్తవాడ ప్రాంతానికి చెందిన చేనేత కార్మికుడు మేరుగు మురళి మృతి పట్ల టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు నేత ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. మురళి బుధవారం తెల్లవారుజామున మరణించిన విషయం తెలియగానే, వెంకటేశ్వర్లు వెంటనే వారి ఇంటికి వెళ్లి, మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులు అర్పించారు. గత కొంతకాలంగా చేయి విరిగి చికిత్స పొందుతున్న మేరుగు మురళి, ఈ రోజు తెల్లవారుజామున ఊపిరితిత్తుల సమస్యతో శ్వాస అందక మరణించారు. మృతుని భార్య ధనలక్ష్మి చేనేత వృత్తి చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వారిద్దరు ఆడపిల్లలు, సౌమ్యశ్రీ, తరుణి డిగ్రీ చదువుతున్నారు. ఇల్లు లేని కారణంగా మృతదేహాన్ని రోడ్డుపై ఉంచాల్సిన దుస్థితి తనను కలచివేసిందని వెంకటేశ్వర్లు అన్నారు. పెళ్లికి ఎదిగిన అమ్మాయిలు ఉన్న ఈ కుటుంబానికి పెద్ద దిక్కు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరికి త్వరలో మంత్రి కొండా సురేఖ ద్వారా ఇందిరమ్మ ఇంటి శాంక్షన్‌లో ప్రాధాన్యత ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. మురళి గాయత్రి మాక్స్ సంఘంలో సభ్యునిగా ఉండి, త్రిఫ్ట్ పథకంలో ఉన్నందున, చేనేత బీమా పథకం ద్వారా ప్రభుత్వం ద్వారా మంజూరయ్యే రూ. 5 లక్షల మొత్తాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని సహాయ సంచాలకులు (చేనేత జౌళి శాఖ) శ్రీకాంత్ రెడ్డికి తెలియపరిచినట్లు వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆడెపు శ్రీనివాస్ (నైజాం డిస్ట్రిబ్యూటర్), బంక దేవేందర్, సహకార సంఘం అధ్యక్షులు ఎలుగం శ్రీనివాస్, ఇతర చేనేత కార్మికులు పాల్గొన్నారు.

## వైద్య సేవలు మరింత మెరుగుపరచాలి

### ఏఐటీయూసీ నాయకుల విజ్ఞప్తి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఎంజీఎం హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ హరిచంద్ర రెడ్డిని ఏఐటీయూసీ హనుమకొండ జిల్లా సమితి అధ్యక్షులు వేల్పుల సారంగపాణి యాదవ్, ఆల్ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్, హనుమకొండ జిల్లా అధ్యక్షులు పంకేర్ల కుమారస్వామి యాదవ్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు పూల బొకే అందజేసి, సూపరింటెండెంట్ కి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వేల్పుల సారంగపాణి యాదవ్ మాట్లాడుతూ ఎంజీఎం హాస్పిటల్‌లో వైద్య సేవలను మరింత మెరుగుపరచడానికి సూపరింటెండెంట్ నాయకత్వంలో సిబ్బంది కృషి కొనసాగించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్మిక వర్గాల ఆరోగ్య సేవలకు హాస్పిటల్ అందిస్తున్న సహకారానికి వారు కృతజ్ఞతలు తెలిపారు. దీనికి ప్రతిస్పందనగా సూపరింటెండెంట్ డాక్టర్ హరిచంద్ర రెడ్డి మాట్లాడుతూ సామాన్య ప్రజలకు మరియు కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ, ఆల్ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

## 14న విజ్ఞాన్ ఐటీఐ ఆధ్వర్యంలో అప్రెంటిస్‌షిప్ మేళా

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** విజ్ఞాన్ ఐటీఐ కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కొమురయ్య ఒక ప్రకటనలో తెలిపారు.ఐటీఐ పాసైన విద్యార్థులు ఈ అప్రెంటిస్‌షిప్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ మేళాకు తోషిబా, టాటా వంటి ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. శుక్రవారం, ఉదయం 10:00 గంటలకు హాజరు కావాలి. మేళాలో పాల్గొనే అభ్యర్థులు తమ వెంట ఎస్.ఎస్.సీ, ఆధార్, పాన్, ఐటీఐ, ఎన్.సీ.వి.టీ సర్టిఫికెట్లను తప్పనిసరిగా తీసుకురావాలని ఆయన కోరారు.

# నూతన తహసిల్దార్ కు శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు



**వరంగల్ వాయిస్, హసన్ పర్తి :** హసన్ పర్తి తహసిల్దార్‌గా విధులు నిర్వహించిన చల్లా ప్రసాద్ హనుమకొండ కలెక్టర్ కార్యాలయానికి బదిలీ కాగా, ఆయన స్థానంలో పూజారి కిరణ్ కుమార్ కొత్త తహసిల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా 66వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు కనపర్తి కిరణ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నూతన తహసిల్దార్ పూజారి కిరణ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే అందజేసి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు వీసం సురేందర్ రెడ్డి, మాజీ దేవస్థానం చైర్మన్ జన్ను రవీందర్, మాజీ సర్పంచ్ పుల్ల రవీందర్, నాయకులు కోడలు మురళి, పెద్దమ్మ నరసింహారావు, గరిగరాజు పెద్దమ్మ సురేష్, మూల తిరుపతి, రామంచ ఐలయ్య, కేతపాక రాజు తదితరులు పాల్గొన్నారు.

# పద్మశాలి కార్తీక మాస వన భోజన మహోత్సవ ఏర్పాట్ల పరిశీలన



**వరంగల్ వాయిస్, ఖిలా వరంగల్ :** వరంగల్ జిల్లా పట్టణ పద్మశాలి సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 16 ఆదివారం రోజున కార్తీక మాస వన భోజన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం కోసం ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు, బుధవారం (నవంబర్ 12, 2025) నాడు జిల్లా పద్మశాలి సంఘం నాయకులు ఖిలా వరంగల్ వాకింగ్ గ్రౌండ్‌ను సందర్శించి, చేపట్టవలసిన పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు డాక్టర్ లయన్ ఆడెపు రవీందర్, జిల్లా కో ఆర్డినేటర్ వడ్నాల నరేందర్, జిల్లా గౌరవ అధ్యక్షులు కుసుమ సతీష్ బాబు, పట్టణ అధ్యక్షులు డీ.ఎస్.మూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి గోరంటల రాజు, యువజన అధ్యక్షులు బేతి అశోక్ బాబు, సంఘ నాయకులు మార్గం యెల్లయ్య, బాసాని శ్రీనివాస్, కూచన క్రాంతి కుమార్, ఆడెపు వెంకటేష్, గోరంటల మనోహర్, కొంత సంగీత్, గుండు కామేశ్వర్, బైరి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# బాలికల ఎదుగుదలకు తోడ్పాటు




**వరంగల్ వాయిస్, గణపురం :** ఆరోగ్యకరమైన సమాజంలో బాలికలు పెరిగేందుకు వీలుగా స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఉచిత సానిటరీ న్యాప్కిన్స్ పంపిణీ చేయడం అభినందనీయమని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. బుధవారం భూపాలపల్లి నియోజకవర్గం, గణపురం మండలం గాంధీనగర్‌లోని మహాత్మా జ్యోతిబాపులే బాలికల పాఠశాలలో 'గివ్ ఫర్ సొసైటీ' ఆధ్వర్యంలో నిర్వహించిన "స్త్రీ స్వాభిమాన్ – మెన్స్ట్రుయల్ హైజీన్ అండ్ డిగ్నిటీ ఇనిషియేటివ్" కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తో కలిసి పాల్గొన్నారు. మహిళల ఆరోగ్యం, గౌరవం కోసం ప్రభుత్వం, సేవా సంస్థలు చేపడుతున్న ప్రజోపయోగ కార్యక్రమాలను అతిథులు అభినందించారు. గివ్ ఫర్ సొసైటీ సభ్యులు బాలికల కోసం సానిటరీ హైజీన్ కిట్ల పంపిణీ, అవగాహన వర్క్‌షాప్‌లు నిర్వహించినందుకు అతిథులు అభినందించారు. అనంతరం విద్యార్థినిలకు సానిటరీ హైజీన్ కిట్లను అతిథుల చేతుల మీదుగా అందజేశారు.

# ఆహ్లాద కేంద్రం కాస్తా.. అసాంఘిక కార్యకలాపాల అడ్డా

- దమ్మన్నపేట పల్లె ప్రకృతి వనంపై నిర్లక్ష్యం
- దట్టంగా పెరిగిన చెట్లు, అడవిని తలపిస్తున్న వనం



**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలోని దమ్మన్నపేట గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో ఎంతో ఆర్భాటంగా నిర్మించిన పల్లె ప్రకృతి వనం, ప్రస్తుతం అధికారుల నిర్లక్ష్యం కారణంగా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పల్లె ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం, పిల్లలు, పెద్దల ఆరోగ్య పరిరక్షణ కోసం వాకింగ్, సేద తీరడం వంటి లక్ష్యాలతో ఈ వనాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం సాయంత్రం అయినట్లయితే ఈ పల్లె ప్రకృతి వనం ఆకతాయిలకు స్థావరంగా మారింది. ఇక్కడ మద్యం సేవించడం సహా అనేక అసాంఘిక కార్యకలాపాలు కొనసాగుతున్నాయని గ్రామస్తులు బహిరంగంగా విమర్శిస్తున్నారు. వనం నిర్వహణ పూర్తిగా గాలికొదిలేయడంతో, ఇందులోని చెట్లు దట్టంగా పెరిగి అడవిని తలపిస్తున్నాయి. దీనికి తోడు, వనంలో నాటిన చెట్లలో పర్యావరణ శాస్త్రవేత్తలు కోనోకార్పస్ జాతికి చెందిన చెట్లు కూడా ఉన్నాయని కొందరు



గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పర్యావరణ శాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం, కోనోకార్పస్ వంటి కొన్ని రకాల చెట్లపై పక్షులు నివసించవని, వాటి గాలిని పీల్చడం ద్వారా మానవాళికి శ్వాసకోశ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని వారు చెబుతుండడం మరింత ఆందోళన కలిగిస్తోంది.

## అధికారులు స్పందించాలి..

పల్లె ప్రకృతి వనంలో అసాంఘిక కార్యకలాపాలు కొనసాగడం, పర్యావరణపరంగా ప్రమాదకరమైన చెట్లను గుర్తించకపోవడం వంటి విషయాలపై స్థానిక అధికారులు కన్నెత్తి కూడా చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది. కాబట్టి, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, చెట్ల పరిశీలన, పార్క్ నిర్వహణపై దృష్టి సారించాలని, అలాగే అసాంఘిక కార్యకలాపాలను అరికట్టి, పల్లె ప్రకృతి వనాన్ని ప్రజలకు ఆహ్లాద కేంద్రంగా మార్చే దిశగా ప్రయత్నం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# యువతలో వివేకానందుని స్ఫూర్తిని నింపాలి

- కలెక్టర్ డాక్టర్ సత్య శారద పిలుపు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువజన ఉత్సవాలను పురస్కరించుకుని, స్వామి వివేకానందుని జయంతిని బుధవారం పోతన ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ జి. సంధ్యారాణి లు హాజరై, వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు సమర్పించి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద యువతీ యువకులను ఉద్దేశించి మాట్లాడారు. యువత దేనికీ భయపడకూడదని, ప్రతి సమస్యను ధైర్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులను గౌరవించి, వారిపై ప్రేమ చూపాలని సూచించారు.యువతీ యువకుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. క్రీడల్లో పాల్గొనే పిల్లల్లో ఆత్మవిశ్వాసం ఎక్కువగా ఉంటుందని, విద్యార్థి దశ నుంచే క్రీడలు పిల్లలకు ఎంతో మేలు చేస్తాయని పేర్కొన్నారు. చదువుతో పాటు ఆటలు, పోటీల్లో రాణించడం వలన మనసుకు ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని ఇస్తాయని తెలిపారు. ఇక్కడ గెలిచిన యువతీ యువకులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి వరంగల్‌కు కీర్తి కిరీటాన్ని నిలబెట్టాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా క్రీడల్లో గెలుపొందిన పిల్లలకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేయడం జరిగింది. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, జిల్లా యువజన క్రీడల అధికారి అనిల్ కుమార్, ప్రిన్సిపాల్ భుజంగారెడ్డి, సైన్స్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, జాతీయ యువజన అవార్డు గ్రహీత శ్రీకాంత్, జాతీయ జానపద కళాకారుడు ఆకులపల్లి కరుణాకర్, రాజేందర్, మౌనికలు పాల్గొన్నారు. నాగేష్, రాజేందర్ రెడ్డి, చిరంజీవిలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

# అక్రమ డిప్యూటేషన్లు తక్షణమే రద్దు చేయాలి

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ బాబుకు వినతి పత్రం



**వరంగల్ వాయిస్, జనగాం :** జనగాం జిల్లాలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఉపాధ్యాయుల అక్రమ డిప్యూటేషన్లను వెంటనే రద్దు చేసి, పాఠశాలలను రక్షించాలని ఎల్.హెచ్.పీ.ఎస్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీర వెంకట్ నాయక్ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ బాబుకి వినతి పత్రం సమర్పించారు. అజ్మీర వెంకట్ నాయక్ మాట్లాడుతూ... జనగాం జిల్లాలో ప్రస్తుతం నర్మెటా, జనగాం, స్టేషన్‌ఘన్‌పూర్ లలో బాలికలు, బాలుర కోసం నాలుగు గిరిజన సంక్షేమ పాఠశాలలు నడుస్తున్నాయని తెలిపారు. ఈ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు అత్యంత పేద గిరిజన కుటుంబాలకు చెందినవారని, వారి తల్లిదండ్రులు హైదరాబాద్, కరీంనగర్, హనుమకొండ పట్టణాల్లో కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారని వివరించారు. ప్రస్తుత జనగాం డీటీడీఓ ఈ పాఠశాలల ఉపాధ్యాయులను, పీజీహెచ్‌ఎంలను (పీజీహెచ్ఎం– పోస్ట్ గ్రాడ్యుయేట్ హెడ్ మాస్టర్స్) డిప్యూటేషన్ పేరుతో వారి సొంత ఇండ్ల దగ్గర ఉన్న పాఠశాలలకు పంపడం జరిగిందన్నారు. నర్మెట్ట, స్టేషన్‌ఘన్‌పూర్ పాఠశాలల పీజీహెచ్‌ఎంలు ఇద్దరినీ హనుమకొండకు డిప్యూటేషన్ పై పంపారు. ఈ రెండు పాఠశాలలకు చెందిన ఐదుగురు స్కూల్ అసిస్టెంట్లు (స్కూల్ అసిస్టెంట్లు), మ్యాథ్స్, పీఈటీ, తెలుగు, ఫిజిక్స్ బోధించే సీఆర్‌టీలను (CRT – కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్స్) సైతం డిప్యూటేషన్ పేరుతో ములుగు, మహబూబాబాద్ జిల్లాలకు పంపడం జరిగింది. పిల్లలకు ఆటలు కూడా చదువులో భాగమైనప్పటికీ, ఈ రెండు పాఠశాలల పీడీలు (PD) కూడా డిప్యూటేషన్ పై వెళ్ళడంతో పిల్లలకు ఆటలు కరువయ్యాయి. దీనివల్ల ఇక్కడి విద్యార్థులకు సరైన బోధన లేక ఇబ్బంది పడుతున్నారని, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల బోధన పేద విద్యార్థులకు కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. వార్తాపత్రికల్లో కథనాలు వచ్చినప్పటికీ అధికారులు ఏమాత్రం స్పందించకపోవడం దారుణమన్నారు. కాబట్టి, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ బాబు వెంటనే స్పందించి జనగాం, హనుమకొండ జిల్లాల డి.టి.డి.ఓలు ఇచ్చిన అన్ని డిప్యూటేషన్లను తక్షణమే రద్దు చేయాలి. ఈ అక్రమ డిప్యూటేషన్లపై విచారణ జరిపించి, జిల్లాలోని గిరిజన సంక్షేమ పాఠశాలలను రక్షించాలని విజ్ఞప్తి చేశారు.

వరంగల్ వాయిస్
సినిమా
బుధవారం 12 నవంబర్ 2025



# బెడ్ సీన్స్ చేసేప్పుడు నలిగిపోక తప్పదు

## మళయాల బ్యూటీ దివ్య స్వీయానుభవం



ఇప్పటి సినిమాలు, వెబ్ సిరీస్‌ల్లో రొమాన్స్‌కి బదులుగా లిప్‌లాక్‌లు, బెడ్‌సీన్స్ ఎక్కువవుతున్నాయి. ప్రేక్షకులు ఏమి కోరుకుంటే అదే చూపిస్తున్నామని మేకర్స్ అంటున్నారు. అయితే ఇవి నటించడం అంత ఈజీ కాదని నటి దివ్య పిల్లై స్పష్టం చేసింది. ఎయిర్‌లైన్స్ జాబ్ నుంచి సినిమా రంగంలోకి అడుగుపెట్టిన ఈ మలయాళ బ్యూటీ, తెలుగు ప్రేక్షకులకు 'తగ్గేదేలే' సినిమాలో హీరోయిన్‌గా గుర్తుంది. ఆ సినిమాలో లిప్‌లాక్ సీన్ చేసిన దివ్య, తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆ అనుభవం గురించి చెప్పింది. తాను మొదటగా మలయాళంలో 'కళాపురుష్' సినిమాలో టొవినో థామస్‌తో ఇంటిమేట్ సీన్ చేశా. ఫస్ట్ నో చెప్పా చుట్టూ కెమెరాలు, జనం ఉన్నప్పుడు అసౌకర్యంగా అనిపించింది. కానీ దర్శకుడు కట్ చెప్పే వరకు నటించాల్సిందే. ఆ సమయంలో ఏం చేసినా భరించాల్సిందే.. కెమెరా ఆన్ అయిన తర్వాత నటుడు, నటి ఇద్దరూ క్యారెక్టర్‌లో లీనం కావాలి. లిప్‌లాక్ లేదా బెడ్‌సీన్ చేస్తున్నప్పుడు మనకు ఇబ్బంది అనిపించినా, ఆ ఫీలింగ్ ఫేస్‌లో కనిపించకూడదు. సీన్ పూర్తయ్యేవరకు సహ నటుడు ఏం చేసినా కూల్‌గా ఉండాలి. ఎందుకంటే ప్రేక్షకుడు చూస్తే అది ఫేక్‌గా కాకుండా నేచురల్‌గా కనిపించాలని చెప్పుకొచ్చింది దివ్య. అలాగే, 'నేను గ్లామర్ రోల్స్ చేసినా, స్క్రిప్ట్‌కి తగ్గట్టు చేస్తాను. ఎప్పుడూ లిమిట్స్ దాటను. ప్రేక్షకులు నన్ను నటిగా మాత్రమే చూడాలని కోరుకుంటానని తెలిపింది. కాగా ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుండటంతో.. కొందరు నెటిజన్లు ఆమె ప్రొఫెషనలిజాన్ని ప్రశంసిస్తుంటే, మరికొందరు ఇలాంటి సీన్స్ అవసరమా అంటూ కామెంట్స్ చేస్తున్నారు. దివ్య ప్రస్తుతం రెండు మలయాళ సినిమాలు, ఒక తెలుగు వెబ్‌సిరీస్‌లో నటిస్తోంది.

# ప్యారడైజ్ కోసం భారీ సెట్






టాలీవుడ్ స్టార్ యాక్టర్ నాని దసరా డైరెక్టర్‌తో ది ప్యారడైజ్ సినిమా చేస్తున్నాడని తెలిసిందే. ఈ మూవీలో మోహన్ బాబు కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఇప్పటికే లాంచ్ చేసిన నాని లుక్‌తోపాటు మోహన్ బాబు పోస్టర్ నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి. ది ప్యారడైజ్‌లో నేషనల్ అవార్డ్ విన్నింగ్ నటి సోనాలి కులకర్ణి కీ రోల్ పోషిస్తోంది. సోనాలి కులకర్ణి ఈ చిత్రంలో నాని తల్లిగా కనిపించనుంది. కాగా ది ప్యారడైజ్ షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో కొనసాగుతోంది. ఇప్పుడొక ఆసక్తికర వార్త నాని అభిమానుల్లో క్యూరియాసిటీ పెంచుతోంది. ఇంతకీ విషయమేంటంటే ది ప్యారడైజ్ కోసం హైదరాబాద్‌లో ఏకంగా రూ.7.5 కోట్లతో హౌస్ సెట్ వేస్తున్నారట. ఫలక్‌నుమా ప్యాలెస్‌ను గుర్తుకుతెచ్చేలా ఉండబోతున్న ఈ ఇంటిని అల్యూమినియం ఫ్యాక్టరీలో నిర్మిస్తున్నారని ఇన్‌సైడ్ టాక్. ఈ వార్తతో నాని టీం ఈ సారి ఏదో పెద్ద ప్లానే వేసిందని తెగ చర్చించుకుంటున్నారు. ఇక డిసెంబర్ చివరికల్లా లేదా జనవరి మొదట్లో ఈ మూవీ నుంచి మరో గ్లింప్స్ లాంచ్ చేసేందుకు సన్నాహాలు చేస్తుందట. మరి దీనిపై రాబోయే రోజుల్లో మేకర్స్ ఏదైనా క్లారిటీ ఇస్తారేమో చూడాలి. ఈ మూవీలో కిల్ ఫేం రాఘవ్ జుయల్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఈ మూవీని ఎస్‌ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌లో దసరా ఫేం సుధాకర్ చెరుకూరి తెరకెక్కిస్తున్నారు. షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమాకు సంబంధించి ఆసక్తికర వార్త నెట్టింట హల్ చల్ చేస్తోంది. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఓ వైపు బ్లాక్ బస్టర్ దసరా కాంబో రిపీట్ అవడం, మరోవైపు జెర్సీ, గ్యాంగ్ లీడర్ తర్వాత నాని `అనిరుధ్ కాంబోలో వస్తున్న సినిమా కావడంతో ది ప్యారడైజ్‌పై అంచనాలు భారీగానే ఉన్నాయి.

# ప్రొఫెషనల్ లైఫ్‌లోకి తిరిగి సమంత

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత ప్రస్తుతం సినిమాలతో పాటు వ్యాపార రంగంలో కూడా తనదైన ముద్ర వేస్తోంది. కొంతకాలం ఆరోగ్య సమస్యలు, వ్యక్తిగత కారణాలతో సినిమాలకు దూరంగా ఉన్న ఆమె, ఇప్పుడు మళ్లీ పూర్తి స్థాయిలో ప్రొఫెషనల్ లైఫ్‌లోకి తిరిగి వచ్చింది. వరుసగా కొత్త సినిమాలు, వెబ్ సిరీస్‌లు చేస్తూ, నిర్మాతగా కూడా కొత్త ప్రయోగాలు చేస్తోంది. తాజాగా సమంత తన సొంత బ్యానర్ 'ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్' కింద 'మా ఇంటి బంగారం' అనే సినిమాను నిర్మిస్తోంది. ఈ సినిమా పూజా కార్యక్రమం ఇటీవలే ఘనంగా జరిగింది. ఇందులో సమంతతో పాటు దిగంత్, గుల్షన్ దేవయ్య ప్రధాన పాత్రల్లో నటించగా, సీనియర్ నటి గౌతమి, మంజుషా కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ సినిమాను రాజ్ నిడుమోరు, హిమాంక్ దువ్వూరుతో కలిసి సమంత నిర్మిస్తున్నారు. ఇక సినిమాలతో పాటు సమంత వ్యాపార రంగంలో కూడా వేగంగా దూసుకెళ్తోంది. తాజాగా సమంత మరో కొత్త క్లాతింగ్ బ్రాండ్‌ను లాంచ్ చేసింది. ఈ సందర్భంగా ఆమె తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ ప్రమో వీడియోను షేర్ చేసింది. వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అభిమానులు, సినీ ప్రముఖులు సమంతకు శుభాకాంక్షలు తెలుపుతూ .. 'సామ్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా కూడా సక్సెస్ అవ్వాలి,ఎప్పుడూ యూనిక్‌గా ఉంటుంది' అంటూ కామెంట్లు చేస్తున్నారు. కొత్త వ్యాపార ప్రయాణం మొదలెట్టిన సమంత ఇప్పుడు నిజంగానే ఒక హ్యాపీ మోడ్‌లో ఉన్నట్టుంది!



# 36 ఏళ్ల తరవాత శివ రీ రిలీజ్

## ఆర్జీవీ, నాగ్‌లతో సందీప్ వంగా చిట్‌చాట్





నాగార్జున రామ్‌గోపాల్ వర్మకాంబినేషన్‌లో వచ్చిన హిట్ మూవీ 'శివ' 36 ఏళ్ల తర్వాతఈ నెల 14న రీ రిలీజ్ కానున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో నాగ్, ఆర్జీవీలతో దర్శకుడు సందీప్ రెడ్డి వంగా చిట్‌చాట్ నిర్వహించారు. 'శివ' 36 ఏళ్ల తర్వాత మళ్లీ థియేటర్లలో సందడి చేయబోతోంది! ఫ్యాన్స్ కోసం ప్రత్యేకమైన సంబరాలు ప్లాన్ చేశారు. ఈ వీడియోలో మూడు జంటల మధ్య సరదా, క్రేజీ ముచ్చట్లు, వెనుకబడిన హిట్ మూవీ రహస్యాలు ఇలా ఫ్యాన్స్‌కి స్పెషల్ ఎమోషనల్ మినిట్స్ పంచుకోబోతున్నారు. ఇది కేవలం ఇంట్రెస్టింగ్ వీడియో మాత్రమే కాదు, నోస్టాల్జిక్ ట్రిప్ కూడా! సందీప్, నాగ్, ఆర్జీవీ మ్యూచువల్ బాండ్, సినిమా మేకింగ్ వెనుక ఉన్న స్టోరీస్, ఫన్ రియాక్షన్స్ చూపించడంతో వీడియో మరింత స్పెషల్ అయింది. శివలో బాలనటి నేడు యూఎస్‌లో సెటిల్ ఆనాటి సన్నివేశాన్ని గుర్తు చేసిన ఆర్జీవీ శివ' సినిమాలోని సైకిల్ ఛేజ్ సీక్వెన్స్ చాలా ఎమోషనల్‌గా ఉంటుంది. అందులో కనిపించిన బాల నటి సుష్మ ఇప్పుడెలా ఉందో తెలియజేస్తూ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ ఫొటో పంచుకున్నారు. యూఎస్‌లో ఏఐ, కాగ్నిటివ్ సైన్స్‌లో రీసెర్చ్ చేస్తుందని తెలిపారు. సుష్మ.. నువ్వు సాహసోపేతమైన సన్నివేశాల్లో నటించావ్. ఆ రిస్కీ షాట్‌తో నువ్వు ఎంతగా భయపడ్డావో ఓ దర్శకుడిగా అప్పుడు నాకు తెలియదు. ఇప్పుడు మనస్ఫూర్తిగా క్షమాపణలు కోరుతున్నా. అంగీకరించు అని ఆమెకు విజ్ఞప్తి చేశారు. ఆ ఛేజ్ సీక్వెన్స్‌ను ఎలాంటి డూప్ లేకుండా షూట్ చేసినట్టు నాగార్జున ఇటీవల తెలిపారు. ఆయన హీరోగా ఆర్జీవీ తెరకెక్కించిన ఈతరం ప్రేక్షకులను అలరించేందుకు ఈనెల 14న మరోసారి బాక్సాఫీసు ముందుకు రానుంది.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GREATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

బుధవారం, నవంబర్ 12, 2025




# మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించాలి

- నియంత్రణకు పాటుపడాలి
- కలెక్టర్ సత్య శారద

**వరంగల్ వాయిస్, వరంగల్ :** మాదక ద్రవ్యాల రవాణా, నియంత్రణ, నివారణపై సంబంధిత అధికారులు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. వరంగల్ జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో బుధవారం ఏర్పాటు చేసిన జిల్లా నార్కోటిక్ కమిటీ మీటింగ్ లో కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలు, కాలేజీల ప్రాంగణంలో విద్యార్థులకు మత్తు పదార్ధాల విక్రయ దారులను కనిపెట్టాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా జిల్లాలో స్ఫూర్తి కార్యక్రమంలో నార్కోటిక్ అధికారులను భాగంచేసి విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. నేటి విద్యార్థులు రేపటి బావిభారత పౌరులుగా తీర్చిదిద్దుటకు విద్యాలయాలు, సమాజం మంచి మార్గ నిర్దేశకాలు కావాలన్నారు. అందుకు సంబంధిత శాఖల అధికారులు, టీచర్లు, తల్లిదండ్రులు బాధ్యత తీసుకొని వారి రోజువారి దినచర్య ఆధారంగా వారి ప్రజ్ఞను అంచనావేసి వారిని భవిష్యత్ తరాలకు వారసులుగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలోని ట్రాన్స్ పోర్ట్ శాఖలు, రైల్వే, బస్సు స్టాండ్స్, ఏరియాలను తరచూ పోలీసులు పెట్రోలింగ్ చేసినట్లయితే మత్తు పదార్ధాల నివారణ అరికట్టవచ్చున్నారు.

పోలీసు శాఖ ఆధ్వర్యంలో అనునిత్యం మత్తు పదార్ధాలు రవాణాలో పెట్రోలింగ్ చేయాలని, స్కూల్స్, కాలేజీలలోని కూడా తరచూ అవేర్నెస్ కల్పించాలని డీసీపీ ఈస్ట్ జోన్ అధికారి అంకిత్ కుమార్ సక్వాల్ సంబంధిత అధికారులకు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం వారోత్సవాల పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ వరంగల్ శుభం, నర్సంపేట ఏసీపీ రవీందర్ రెడ్డి, వర్ధన్నపేట ఏసీపీ నరసయ్య, బి.రమేష్ చందర్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రకాష్, డాక్టర్ భరత్ కుమార్, సైకాలజిస్ట్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మహాదేవయ్యను విధుల్లోకి తీసుకోవాలి

- గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షులు వెంకటేశ్వర్లు
- ఎంపీ కడియం కావ్యకు వినతి

**వరంగల్ వాయిస్, సుబేదారి :** గ్రామీణ తపాలా ఉద్యోగుల న్యాయమైన హక్కుల కొరకు పోరాడుతున్న ఆలిండియా ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ మహాదేవయ్యను కక్ష్య పూరితంగా, అప్రజాస్వామికంగా సర్వీస్ నుంచి తొలగించడం సరికాదని, వెంటనే తమ నేతను విధుల్లోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తూ వరంగల్ పార్లమెంటు సభ్యురాలు కడియం కావ్యకు బుధవారం గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షులు బొద్దున వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. సుబేదారిలోని ఎంపీ క్యాంప్ ఆఫీసులో హనుమకొండ డివిజన్ అధ్యక్షుడు పెరుమాండ్ల తిరుపతి, చంద్రశేఖర్ తో కలిసి ఈ వినతి పత్రం సమర్పించారు. 2023 డిసెంబర్ లో కేంద్ర ప్రభుత్వం నియమించిన కమలేష్ చంద్ర కమిటీ సానుకూల సిఫార్సులను అమలు చేయాలని పలుమార్లు నిరసన తెలియజేసినా స్పందించకపోవడంతో నాలుగు రోజులు నిరవధిక సమ్మె చేయడం జరిగిందన్నారు. అట్టి చట్టబద్ధమైన సమ్మెను గుర్తించి తమ డిమాండ్లను అమలు చేయకపోగా అప్రజాస్వామికంగా తమ నేతను విధుల్లో నుంచి తొలగించడం పట్ల దేశవ్యాప్తంగా లక్షలాదిమంది గ్రామీణ తపాలా ఉద్యోగులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా వ్యక్తిగతమైన కక్ష సాధింపు ధోరణి విడనాడి తమ హక్కులనేత మహాదేవయ్యను విధుల్లోకి తీసుకోవడానికి తమ వంతు సహాయం అందించవలసిందిగా ఎంపీకి విజ్ఞప్తి చేశారు.

# ఉగ్రవాదం పెను ప్రమాదం

జాతీయ రాజధాని ఢిల్లీలోని చారిత్రక ఎర్రకోట సమీపంలో జరిగిన భయంకరమైన బాంబు పేలుడు దేశాన్ని కుదిపేసింది. ఈ ఉగ్రదాడిలో కనీసం 13 మంది అమాయకులు మరణించగా, 20 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. ఈ మరణాలపై దేశవ్యాప్తంగా ప్రగాఢ సంతాపం వ్యక్తమవుతోంది. మరణించిన వారి ఆత్మ శాంతించాలని, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉంది. ఈ దాడిని ఉగ్రవాద చర్యగా పరిగణించిన జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) వెంటనే రంగంలోకి దిగి విచారణ చేపట్టింది. ఇప్పటివరకు అందిన ప్రాథమిక దర్యాప్తు వివరాల ప్రకారం, ఈ పేలుడు వెనుక స్లీపర్ సెల్స్ హస్తం ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు. ఈ దాడికి పాల్పడిన వ్యక్తిగా పుల్వామాకు చెందిన వైద్యుడు, డాక్టర్ ఉమర్ నబిని గుర్తించినట్లు వార్తలు వెలువడుతున్నాయి. ఈ దాడిలో నిషేధిత ఉగ్రవాద సంస్థ జైష్–ఎ–మొహమ్మద్ ప్రమేయం ఉండవచ్చని దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నారు. అయితే, మరింత లోతుగా దర్యాప్తు చేయవలసి ఉందని అధికారులు తెలిపారు.పేలుడులో గాయపడిన వారిలో కొందరి పరిస్థితి ఇంకా ప్రాణాపాయ స్థితిలో ఉంది. ఉగ్రవాదం అనేది కేవలం భారతదేశ సమస్య మాత్రమే కాదు; ఇది యావత్ ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న పెను సమస్య. తీవ్రవాదులుగా మారడానికి కింది అంశాలు మూలకారణాలుగా నిలుస్తున్నాయి. కొందరు తమకు తాము 'హీరో'లుగా భావించుకుంటూ, తాము నమ్మిన సిద్ధాంతాల కోసం హింసకు పాల్పడతారు. తీవ్రవాదులు తరచుగా మానసిక అశాంతితో, ఆత్మన్యూనతా భావంతో ఉంటారు. రాజకీయంగా తగిన ప్రాధాన్యత లభించడం లేదని లేదా అణచివేయబడ్డామని భావించే కొన్ని వర్గాలు హింసాత్మక మార్గాన్ని ఎంచుకుంటాయి. ఆర్థిక అసమానత, సామాజిక అన్యాయం, మరియు అవకాశాల కొరత వంటి అంశాలు నిరుద్యోగులను, పేద యువతను ఉగ్రవాద గ్రూపుల వైపు మళ్లించుకోవడానికి దోహదపడతాయి. ఇలాంటి దాడులు ప్రజల జీవితాల్లో నిరంతర ముప్పును, అభద్రత భావాన్ని పెంచుతాయి. వేర్వేరు మతాలు, వర్గాల మధ్య అనుమానం మరియు విరోధాన్ని పెంచుతుంది. ఈ దాడుల వలన మౌలిక సదుపాయాలు దెబ్బతినడమే కాక, పర్యాటకం, మరియు ఆర్థికాభివృద్ధి కుంటుపడుతుంది. విదేశీ పర్యాటకులు దేశంలో పర్యటించడానికి వెనకంజ వేయడం వలన ఆర్థిక ప్రగతికి ఆటంకం కలుగుతుంది. ఉగ్రవాదాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవడానికి కేవలం సైనిక చర్యలు సరిపోవు; దీనికి సమగ్ర వ్యూహం అవసరం. ఉగ్రదాడులను ముందే అరికట్టడానికి గూఢచార వ్యవస్థలను బలోపేతం చేయాలి. సామాజిక, ఆర్థిక అసమానతలను తగ్గించే చర్యలు చేపట్టడం ద్వారా తీవ్రవాదానికి అనుకూల వాతావరణాన్ని అరికట్టాలి. వేర్వేరు వర్గాల మధ్య పరస్పర విశ్వాసాన్ని, అర్థం చేసుకోవడాన్ని, మరియు సహనాన్ని పెంపొందించాలి. "ఉగ్రవాదాన్ని అరికట్టే బాధ్యత ప్రభుత్వంపైనే కాక, పౌరులందరిపై ఉంది". అందరం కలసి శాంతియుత సమాజం కోసం కృషి చేయాలి .



**రచయిత, సామాజికవేత్త**

**- నిమ్మల శ్రీనివాస్**

**సెల్ నెంబర్ : 9949709866**

# ఎన్నెన్నో ప్రత్యేకతలు

**కాఫీ టేబుల్ బుక్ ను ఆవిష్కరించిన సీఎస్ రామకృష్ణారావు**

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** సమాచార పౌర సంబంధాల శాఖ జాయింట్ డైరెక్టర్ కన్నెకంటి వెంకట రమణ రచించిన 'JEWELS OF ASAF JAHI'S – the Glory of WARANGAL' అనే కాఫీ టేబుల్ బుక్ ను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ రావు బుధవారం ఆవిష్కరించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలోని తన ఛాంబర్ లో ఏర్పాటు చేసిన ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమానికి సమాచార, పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సీహెచ్ ప్రియాంక హాజరయ్యారు. వరంగల్ నగరంలో అస్ఫజాహీల హయాంలో నిర్మితమైన అద్భుత కట్టడాలు, వరంగల్ కేంద్రంగా పాలనను చేసిన సుబేదారుల వివరాలు వారి చరిత్రతో కూడిన ఈ కాఫీ టేబుల్ బుక్ చరిత్ర పరిశోధకులకు, పోటీ పరీక్షలకు హాజరయ్యే వారికి ఉపయోగపడుతుందని సీఎస్ అన్నారు. పౌర సంబంధాల అధికారిగా విధులు నిర్వర్తిస్తూనే చారిత్రక అంశాలతో కూడిన



ఈ కాఫీ టేబుల్ బుక్ ను వెలువరించడం అభినందనీయమని ప్రశంసించారు. వరంగల్ అంటే కాకతీయుల పాలన, వేయిస్తంభాల ఆలయం, ఖిలా వరంగల్, భద్రకాళి ఆలయం వెంటనే మదికి వస్తాయి. అయితే, వరంగల్ నగరంలో అడుగు పెట్టగానే కాజీపేట నుంచి మామునూర్ వరకు నిజాం నవాబులు నిర్మించిన అద్భుతమైన భవనాలు, కాజిపేట రైల్వే స్టేషన్, ప్రస్తుత మిషన్ భగీరథ పథకమైన ఇంటింటికి తాగునీరందించే ధర్మసాగర్ ఫిల్టర్ బెడ్ ఎన్నో ఉన్నాయి. వీ ఈ పుస్తకం చరిత్ర అధ్యయన వేత్తలు, విద్యార్థులు, చరిత్రపై ఆసక్తి ఉన్న వారికి ఉపయోగపడుతుందన్నారు.

# ఓరుగల్లు బిడ్డ అనిల్‌కు 'మాస్టర్ ఆఫ్ లా'లో గోల్డ్ మెడల్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ జిల్లాకు చెందిన కలకోల అనిల్ న్యూఢిల్లీలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఇంటర్నేషనల్ లా (ఎల్ఎల్ఎం) చదువును పూర్తి చేసినందుకుగాను బంగారు పతకంతో సత్కరించారు. నవంబర్ 7న న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ గౌరవాన్ని దక్కించుకున్నారు. ఈ సందర్భంగా అనిల్ తల్లిదండ్రులైన కలకోల అశోక్ బాబు, కలకోల రేణుక తమ కుమారుడు సాధించిన అత్యున్నత స్థానంపై ఆనందాన్ని వ్యక్తం చేశారు. అనిల్ చిన్నప్పటి నుంచి కష్టపడి చదవడమే కాకుండా, న్యాయవాది వృత్తిలో పేదవారికి సహాయ సహకారాలు అందిస్తున్నారని, ఈ గోల్డ్ మెడల్ ఆయన నిర్విరామ కృషికి దక్కిన గౌరవం అని ఉద్విగ్న భరితంగా మీడియాతో మాట్లాడారు. ఆయన సాధించిన గౌరవం పట్ల గ్రామస్తులంతా ఆనందాన్ని వ్యక్తం చేశారు. గోల్డ్ మెడల్ అందుకున్న అనిల్ మాట్లాడుతూ 'ఈ




అవార్డు నాకు గొప్ప గౌరవం. కష్టపడితే సాధించలేనిది ఏదీ లేదంటూ, ప్రతిభకు ఉన్న గౌరవాన్ని మాటల్లో చెప్పలేనిది' అంటూ సంతోషంతో పొంగిపోయారు. ఇది తన జీవితంలో మరిచిపోలేనిది అంటూ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వైస్ ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా సీపీ రాధాకృష్ణన్, హర్యానా గవర్నర్ ప్రొఫెసర్ ఆషీమ్ కుమార్ ఘోష్ తదితరులు పాల్గొన్నారు. గోల్డ్ మెడల్ అందుకున్న అనిల్‌కు స్నేహితులు, శ్రేయోభిలాషులు, బంధువులు, కుటుంబ సభ్యులు, పలు సంస్థలు సత్కారం చేయనున్నాయి.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com